# పరుగు

జి. అనసూయ




అర్చనా... తేజా....

ఇంట్లోకి అడుగుపెడుతూనే గట్టిగా పిలిచాడు ఆనంద్. కిచెన్‌లో పనిచేసుకుంటున్న అర్చన పరుగెత్తినట్టుగా వచ్చింది. ఏమిటండీ.... అంటూ భర్త చేతిలోని ప్యాకెట్స్ అందుకుంది. తేజా ఏడి.... కొడుకు కోసం అటూ ఇటూ చూశాడు ఆనంద్. ఇక్కడే ఉండాలే ఆ...... అడిగో నల్లాదగ్గర.... నీళ్ళన్నీ పారబోస్తున్నాడు. ఉండండి తీసుకొస్తాను అంటూ పరుగెత్తింది అర్చన.

షర్టంతా, జుట్టంతా తడుపుకొని మహా సీరియస్‌గా ఒక బకెట్లోని నీళ్ళను మరో బకెట్లోకి పోస్తున్న తేజాను లాక్కొచ్చింది అర్చన. హాయ్ తేజా.... కంగ్రాట్స్ నీకు పబ్లిక్ స్కూల్‌లో సీటొచ్చింది. అంటూ కొడుకుని ఎత్తుకొని ముద్దుల్లో ముంచెత్తాడు ఆనంద్. నిజంగానా.... ఎంత అదృష్టవంతుడండీ మన తేజా..... అంటూ ఆనందంతో ఉక్కిరి బిక్కి రయ్యింది అర్చన.

ఇదిగో తేజా ఈ స్వీట్లన్నీ నీకే అంటూ స్వీట్ ప్యాకెట్స్ వాడి చేతుల్లో పెట్టాడు ఆనంద్.

తల్లిదండ్రులను అంతగా ఆనందపెట్టిన అయిదేండ్ల తేజా స్వీట్ ప్యాకెట్ విప్పడంలో బిజీ అయిపొయ్యాడు.

తేజా పబ్లిక్ స్కూల్ ఎంట్రన్స్ కొరకు తాము పడ్డ పాట్లూ ఒహ్ ఎంత టెన్షన్.... ఎంత ప్రిపరేషన్..... ఎంత ఎక్సైట్‌మెంట్ ఎందరెందరి రికమండేషన్లు.

ఏమయితేనేం వాడికి పబ్లిక్ స్కూల్లో సీటొచ్చిందంటే ఇక జీవితంలో సెటిలయినట్టే.

పెద్ద పెద్ద ఐఏఎస్ ఆఫీసర్లంతా పబ్లిక్ స్కూళ్ళల్లో చదివిన వాళ్ళే అర్చనా రేపట్నుండి తేజాస్కూల్ బస్ ఏడుగంటలకల్లా వస్తుంది. ఆసరికి రెడీగా ఉంచాలి. ఒక్కరోజు కూడా స్కూల్ మిస్సవకూడదు తెలిసిందా. వాడు క్లాసులో నెం.వన్‌గా ఉండాలి. ప్రొద్దున్నే అయిదింటికల్లా లేపి హోమ్‌వర్కులవీ చేయించాలి ఆర్డరు జారీ చేశాడు ఆనంద్. సరేలేండి, అవన్నీ నేను చూసుకుంటాను అన్నది అర్చన.

ఎల్.కె.జి, యు.కే.జి, ప్రక్కనే ఉన్న లిటిల్‌బడ్స్ స్కూల్లో చదివాడు తేజ. సహజంగా చురుకైనవాడు. రేపట్నుండి అంతదూరం వెళ్ళాలి ఎలా వెళతాడో ఏమో అనుకుంది తల్లి మనసు.

ప్రొద్దున్నే అయిదింటికి అలారం మోగగానే లేచిన అర్చన తేజ పడుకున్న రూంలోకి వెళ్ళింది. ఇంకా చీకట్లు విచ్చుకోలేదు.

తేజా లే నాన్నా ! అయిదవుతోంది. నోట్లో బ్రేలేసుకొని గాథ

నిద్రలో ఉన్న తేజా ఎన్నో సార్లు పిలువగా పిలువగా లేచి కూర్చున్నాడు కళ్ళు నులుముకుంటూ.

నిద్రకళ్ళతో ఉన్నవాడికి అలాగే బ్రష్ చేసి స్నానం చేయించి యూనిఫామ్ వేసింది.

అమ్మా ఈ బట్టలు వద్దమ్మా.... అమ్మా ఈ షూస్ నొప్పి పెడుతున్నాయమ్మా.... పాలు వద్దమ్మా..... నేను ఏమి తిననమ్మా...... నాకు ఆకలి లేదమ్మా..... గింజుకుంటున్న తేజా నోట్లో టిఫిన్ కుక్కి బ్యాగ్ సర్ది బస్సు వచ్చే వేళకు రెడీగా ఉంచింది అర్చన. సాయంత్రం వచ్చినప్పటి నుండి హోమ్‌వర్క్‌తో కుస్తీ, ఒకోరోజు అన్నం కలిపి పెడుతుండగానే నిద్రపొయ్యేవాడు తేజా. మళ్ళీ ప్రొద్దున్నే అదే రొటీన్.... అలా ఉరుకులు, పరుగులతో ఒక్కొక్క క్లాసే దాటుకుంటూ టెంత్‌కొచ్చాడు తేజా. టెంత్ ఆఖరు పరీక్ష వ్రాసిన రోజు అమ్మయ్య ఇక హాయిగా నిద్రపోవచ్చు.... నిశ్చింతగా ఆడుకోవచ్చు అనుకున్నాడు. ఆ సాయంత్రమే ఆనంద్ వాడిని ఐ.ఐ.టి పౌండేషన్ కోర్సులో చేరమని మంచి కోచింగ్ సెంటర్‌లో జాయిన్ చేశాడు.

నాన్నా నేను మెడిసన్ చదువుతాను...... కొడుకు మాట పూర్తి కాక ముందే

నో తేజా ! ఇప్పుడంతా ఐ.టి.యుగం. ఈ చానల్‌లో అయితే త్వరగా మరో అయిదేండ్లలో సెటిల్ అయిపోవచ్చు డాక్టరుగా, కలెక్టర్‌గా వదేండ్లలో సంపాదించేది ఐ.టి.రంగంలో ఏడాదిలో సంపాదించవచ్చు. నా మాట విని ఐ.ఐ.టి. కోచింగ్ తీసుకో.

మారు మాట్లాడలేదు తేజా. తండ్రి చెప్పినట్లే కోచింగ్‌లో చేరాడు. ఉదయం అయిదు గం॥లకు బయలుదేరితే సాయంత్రం నాలుగయ్యేది ఇల్లు చేరేటప్పటికి. సాయంత్రం మాథ్స్, ఫిజికల్ సైన్స్‌లలో స్పెషల్ కోచింగ్ రెండేండ్ల ఇంటర్మీడియట్ పరుగులు పెడుతూనే పూర్తి చేశాడు.

తండ్రి కోరుకున్నట్టుగానే ఐ.ఐ.టి లో చేరాడు తేజ. మూడవ సంవత్సరం నుండే జి.ఆర్.ఇ, టోఫేలు వ్రాసి మంచి రాంకింగ్ తెచ్చుకున్నాడు. ఫస్టు అటెంప్ట్‌లోనే అమెరికన్ యూనివర్శిటీలో పిజీలో సీటు సంపాదించుకున్నాడు. నేలమీద పరిగెత్తడం నుండి విమానంలో ఎగరడం దాకా ఎదిగిన కొడుకును గర్వంగా చూసుకునేవాడు ఆనంద్. చదువు పూర్తి చేసి అక్కడే మంచి ఉద్యోగంలో చేరాడు తేజా. తనున్న చోటునుండి రెండువందల కి.మీ. ప్రయాణం ఉదయం అయిదింటికి బయలుదేరితే రాత్రి ఏ పదింటికో ఇల్లు చేరడం. లక్షల్లో సంపాదన, స్వర్గాన్ని మరిపించే సౌకర్యాలు కాని వాటిని అనుభవించడానికి, ఆనందించడానికి సమయమే ఉండేది కాదు. అమ్మా నాన్నతో ఫోనులో మాట్లాడ్డానికి కూడా తీరిక లేనంత బిజీ లైఫ్.

ఓ నెలరోజులు సెలువు పెట్టి వచ్చి పెళ్ళి చేసుకొని వెళ్ళరా తల్లి అభ్యర్థన. రోజుకో ఫోటో ఇంటర్నెట్‌లో పంపడం..... వాటిని చూసీ చూడకుండానే అమ్మా నేను వచ్చాక చూస్తానని చెప్పడం. మూడేండ్ల తర్వాత ఓ నెల రోజుల కొరకు వచ్చాడు తేజా. 'ప్రియ'ను చూడటం ఓకె అనడం వారంలో పెళ్ళి ఉన్న నాలుగు రోజులు అటూ ఇటూ తిరగడం ఫైట్లు ఎక్కేయడం అంతా కళ్ళు మూసి తెరిచేలోగా జరిగిపోయాయి. ప్రియ అక్కడే ఎం ఎస్ పూర్తి చేసి జాబ్‌లో చేరడం. ఇద్దరు పిల్లలు వేరు వేరు ప్రాంతాల్లో ఉద్యోగాలు... ఏ మధ్య రాత్రో కలుసుకోవడం. ఏ వీకెండ్సో పిల్లలతో కలిసి గడపడం. అమ్మకు హార్ట్‌ఎటాక్ వచ్చిందిరా ! హాస్పిటల్లో చేర్పించాను తండ్రి గొంతులో నిస్సహాయత.

నువ్వేమి కంగారుపడకు నాన్నా రెండు లక్షల డ్రాఫ్టు పంపిస్తున్నాను. అన్ని టెస్టులూ చేయించు. నేను డాక్టర్స్‌తో మాట్లాడతాను. అంటూ ఫోనులోనే ఓదార్పులు.

పోనివ్వండి వాడికక్కడ ఎన్ని పనులో... లోలోపలే కుమిలిపోతున్న భర్తను ఓదార్చింది అర్చన.

స్కూటర్ ఆక్సిడెంట్‌లో నాన్న కాలు విరిగిందన్నప్పుడు సారీ నాన్న నేను దగ్గరుండి చూసుకోలేకపోతున్నాను. ఇక టూ వీలర్‌కు స్వస్తి చెప్పండి. డబ్బు పంపిస్తున్నాను. కారు కొనండి. డ్రైవర్ను పెట్టుకొని ఎక్కడికి వెళ్ళాలన్నా కార్లోనే వెళ్ళండి. ఇక్కడ ఉద్యోగాలలో ఎప్పుడూ అన్‌సర్టైనిటి నేను తొందర్లో వీలు చూసుకొని వస్తాను. అంటూ ధైర్యం చెప్పాడు.

'కొడుకు డిగ్నిటీ కొరకన్నా కారు కొనాలి. అనుకున్నాడు. నాలుగేండ్లు గడిచాయో లేదో ఆనంద్ హఠాత్తుగా నిద్రలోనే మాసివ్ హార్ట్ ఎటాక్‌తో మరణించాడు.

ప్రపంచమంతా శూన్యంగా కనిపించింది అర్చనకు. ఒక్కసారి కొడుకు చేతుల్లో తలదాచుకుని ఏడవాలనిపించింది. కాని కాలిఫోర్నియాలో కాన్ఫిడెన్షియల్ డిస్కషన్‌లో ఉన్న తేజాకు మూడు రోజులకు గాని మెసేజ్ అందలేదు. దగ్గరి బంధువులే దగ్గరుండి కార్యక్రమాలన్నీ నడిపించారు. నిస్సహాయంగా, ఒంటరిగా మిగిలిపోయిన అర్చనకు మొదటిసారిగా మరో బిడ్డ లేనందుకు బాధ కలిగింది.

నాన్నగారి ఋణం తీర్చుకోలేకపోయి నందుకు క్షమించమ్మా ఫోనులోనే రోదించాడు తేజా. ఓదార్చి ధైర్యవచనాలు చెప్పడం అర్చన వంతయింది.

క్రమంగా జీవితం పట్ల విరక్తి కలుగ సాగింది తేజాకు. ఆఫీసు పనిమీద ఏకాగ్రత కుదరటం లేదు. దేనిమీదా ఇంట్రెస్ట్ కలుగటం లేదు.

అన్యమనస్కంగా ఉంటున్న తేజాను అడిగింది ప్రియ ఓ రోజు.

ఏమయింది తేజా మీకు. ఎనీ ప్రాబ్లమ్.

లేదు ప్రియా ! జీవితం మీదే విసుగు పుడుతోంది. ఈ జీవితానికి అర్థమే లేదని పిస్తోంది. బహుశా ఇలాగే ఉంటే నేను పిచ్చివాడినవుతానేమో. ఉద్యోగం చేయాలని పించడం లేదు.... నేను జాబ్‌కు రిజైన్ చేస్తాను. రిజైనా...తర్వాత ఏంచేస్తారు.... అనుమానంగా అడిగింది ప్రియ.

ఏమో?ప్రియా అదంతా ఆలోచించలేదు. బహుశా ఇండియా వెళతానేమో. శూన్యంలోకి చూస్తూ అన్నాడు తేజా. వ్వాట్ ఇండియానా.... మరి నేను... నా ఉద్యోగం..... పిల్లలు పిచ్చివాడిని చూసినట్టుగా చూసింది ప్రియ.

లేదు ప్రియా! నేనీ వాతావరణంలో ఉండలేకపోతున్నాను. ఐ ఫీల్ లైక్ మిస్సింగ్ సమ్‌థింగ్.

ఏమో బాబూ ఉన్నట్టుండి ఇదంతా వదిలివెళ్ళడం నా వల్ల కాదు. అయినా అందరం, అంతా వదిలేసి ఉన్నట్టుండి వెళ్ళాల్సిన అవసరం ఏముంది. కావాలంటే మీరు వెళ్ళి కొన్నాళ్ళు ఉండి రండి. అయినా అక్కడ మాత్రం ఎవరున్నారు? అత్తయ్య ఒక్కటే కదా. మీరు తిరిగి వచ్చేటప్పుడు తనను కూడా తీసుకురండి తేలిగ్గా సమస్య పరిష్కరించినట్లు చెప్పింది ప్రియ. నిజమే ప్రియ చెప్పినట్లు ఈ ఫీలింగ్స్ తన ఒక్కడివయితే అందర్నీ డిస్ట్రబ్ చెయ్యడం ఎందుకు. ప్రియ కుటుంబాన్ని మేనేజ్ చెయ్యగలదు. తన ఫ్రెండ్స్, బంధువులూ చాలా మంది ఉన్నారిక్కడ.

ఆర్థిక విషయాలన్నీ ప్రియకు అప్పగించి.. ఇండియా బయలుదేరాడు తేజ.

హఠాత్తుగా, ఒంటరిగా నిరాడంబరంగా వచ్చిన కొడుకును చూసి నివ్వెరపోయింది అర్చన.

భర్త పోయాక సొంత ఊర్లోనే ఉంటున్నది. పల్లె వాతావరణంలో చేతనైనంతలో నలుగురికి సాయపడుతూ ప్రశాంతంగా జీవిస్తున్న తల్లిని చేరి పసిపిల్లవాడిలా ఏడ్చాడు తేజా.

"తేజా ఏమయింది బాబూ! అమ్మాయి పిల్లలు క్షేమమే కదా ఏదైనా సమస్యా? ఎదగటమే తప్ప కిందకు చూడడం తెలియని నీ కళ్ళల్లో ఈ కన్నీళ్ళేంటి బాబూ", అంది అర్చన.

అమ్మా ! నేను అలసిపోయానమ్మా. ఈ అనంతమైన పరుగుపందెంలో నేను బాగా అలిసిపోయానమ్మా. చిన్నప్పటి నుండి పరుగెత్తుతూనే ఉన్నాను కదమ్మా. ఒక్క క్షణం ఆగి వెనక్కి చూసుకుంటే వెనుకబడిపోతామేమో అన్నట్టు ముందుకు మున్ముందుకే సాగే ఈ దిశ, గమ్యంలేని పరుగులో నేను అలిసిపోయా నమ్మా. తల్లి ఒడిలో తల దాచుకుని రోదించ సాగాడు తేజా.

మర్నాడు తల్లితో కలిసి చెరువుగట్టుపై నడుస్తున్న తేజాకు తూర్పున ఉదయిస్తున్న బాలభానుడి కిరణాలు తాకి చెరువులో అరమోడ్పులుగా విచ్చుకుంటున్న తామరలు దూరంగా వినబడుతున్న గుడిగంటలు తొలి సారిగా జీవితంలో వింటున్నట్టు నిలబడి పోయాడు. రాత్రి పగలుకు తేడా తెలియ కుండా. తనొక మనిషినన్న స్పృహ కోల్పోయి ఇన్నాళ్ళు గడిపిన జీవితం గుర్తొచ్చి తను పోగొట్టుకున్న దేమిటో తెలిసొచ్చి ఎస్, ఐ మిస్‌డ్ ఎ లాట్ అనుకున్నాడు మనసులో.

**అణువుల్లాంటి**

**చిరు కవితలకు**

**స్వాగతం.**

# ఋతుచక్రం

రాళ్ళ రూపులే వేరు
గుండెలు ఒక్కటే
రెండు మనసులు పెనవేసినచోట
రెండు చేతులు కలిసిన చోట
ఒక రాతిగుండె అవతరిస్తుంది
విజ్ఞప్తులకు లొంగదు
అభ్యర్థనలకు కరగదు
పరిణామాల పర్యవసానం
రక్తం చిందిస్తూనో
హత్యను అందిస్తూనో -
గొర్రెతోక జీతబత్యాల్తో
బోన్సాయి బతుకుల
వాయీ చేయీ మధ్య
ఆమడ దూరం పెరిగాక
బత్యం కోసం సాగిలపడితే
ఒకానొక రాతిగుండె రంగప్రవేశం చేసి
క్రమశిక్షణ కత్తి ఝళిపిస్తుంది
చిదుగుల్ని ఛిద్రం చేసిన గుండె
సోదికి చిక్కని సాక్ష్యమై ముగుస్తుంది !
నీడలేని తల ఆకాశపందిరి కింద వొదిగి
పాదాలు ప్రభుత్వ బంజర్లో మోపితే
ఒకానొక రాతి గుండె
శరీరాన్ని చుట్టుముట్టి
చిరునామా చెరిపేస్తుంది !
గమనం గతిని అడ్డినపుడు
ప్రాణం పోస్తూ పయనించే గాలి
పల్లం వెతుకుతూ పారేనీరు
ప్రతిఘటనల్ని కూల్చేస్తాయి
ముంచేస్తాయి !
కత్తులు కాలాన్ని వెంబడించిన నాడు
గుడ్డివాళ్ళు చూస్తారు
కుంటివాళ్ళు నడుస్తారు
మూగవాళ్ళు మాట్లాడుతారు
నది సముద్రంలో కలిశాక
పుట్టినచోట తిరిగి ప్రత్యక్షమౌతుంది !

**- అడిగోపుల వెంకటరత్నమ్**